31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

బుధవారం 01 జులై 2026 | పేజీలు : 8

## ఎస్ఐఆర్‌లో అర్హుల ఓట్లు కాపాడాలి

◆ఈసి కొత్త ఆంక్షలతో ప్రజల్లో భయానక వాతావరణం సృష్టిస్తోందన్నారు
◆బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 30 :** ఎస్ఐఆర్‌లో అర్హుల ఓట్లు కాపాడాలని, ఈసి కొత్త ఆంక్షలతో ప్రజల్లో భయానక వాతావరణం సృష్టిస్తోందని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రం లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి,మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ముఖ్య అతిథులుగా

2లో

## మల్లాపూర్ గురుకుల పాఠశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ

◆గురుకులాలపై పెరిగిన నమ్మకాన్ని ఉపాధ్యాయులు నిలబెట్టాలి
◆మౌళిక వసతులకల్పనకు ప్రత్యేక నిధులిస్తాం
◆రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జూన్ 30 :** రాష్ట్రంలో గురుకుల పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు రోజు రోజుకి నమ్మకం పెరుగుతుందని ఇందుకు ప్రధాన కారణం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులేనని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.మంగళవారం పెద్దపల్లి జిల్లాధర్మారంమండలం మల్లాపూర్ గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు.పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మెనూ అల్పాహారం, భోజనం నిర్వాహణను పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్ తో పాటు స్టోర్ రూమ్ ను మంత్రి అడ్లూరి తనిఖీ చేశారు. మల్లాపూర్ గురుకులపాఠశాలకు సరఫరాచేసిన సన్నబియ్యం పరీక్షించి నూకలశాతం ఎక్కువ ఉన్నందున బియ్యాన్ని వెనక్కి తీసుకొని సూపర్ ఫైన్ క్వాలిటీ బియ్యాన్ని పంపించాలని జిల్లా పౌరసరఫరాల అధికారికి మంత్రి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల గురుకుల పాఠశాలలో 27 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, కార్పొరేట్ స్థాయిలోప్రభుత్వ విద్యను అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి విద్యార్థులకు యూనిఫామ్స్ తో పాటు విద్యార్థులకు



అన్నిరకాల వస్తువులను అందించడానికి చర్యలు తీసుకున్నారని మంత్రి వివరించారు. గురుకుల పాఠశా లలో మైనర్ రిపేర్ల కోసం రూ. 69 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. గురుకుల పాఠశాలలో పై తల్లిదండ్రులకు రోజు రోజుకి నమ్మకం పెరుగు తుందని దీనికి తగ్గట్టుగా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనుఅందించాలని గురుకుల ఉపాధ్యాయులకు సూచించారు. గురుకులాల్లో ఉండే విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలన్నారు. గురుకుల పాఠశాల మౌళిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేకనిధులు తీసుకువస్తానని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్లనాయక్ తదితరులు పాల్గొన్నారు.



## అధికారుల సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి

◆జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 30 :** పోలీస్‌శాఖలో పని చేసి పదవి విరమణ పొందిన అధికారులు, సిబ్బంది సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తి దాయకంగా నిలుస్తాయని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు.జిల్లా పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పనిచేయడం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు. ఉద్యోగ జీవితమంతా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన అధికారుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమేనని,జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. రిటైర్ అవుతున్న అధికారులు తమ అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన అధికారులు జె. రవీందర్(ఎస్ఐ),పి.రామచంద్రం (ఎస్ఐ),ఆర్.శ్రీనివాస్ (ఏఎస్ఐ), ఎస్. అంజనేయులు (ఏఎస్ఐ),జి.సత్యానారాయణ (ఏఎస్ఐ),మహ్మద్ సమ్దానీ (ఏఎస్ఐ),జి.మల్లారెడ్డి (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్),ఎం.కిష్టారెడ్డి (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్)లను జిల్లా ఎస్పీ సన్మానించి ,జ్ఞాపికలు

2లో

## విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

◆ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన తరగతి గదులు ప్రారంభించిన జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే
◆స్కూల్ అభివృద్ధికి రూ. లక్ష విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే




**చురకలు ప్రతినిది,ఎల్లారెడ్డిపేట, జూన్ 30 :** విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,పాఠశాల పూర్వ విద్యార్థి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్లోని పీ ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నూతన తరగతి గదుల ను ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంహాజరై ప్రారంభించారు. జాతీయ స్థాయి ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అందించి.. అభినందించారు. అలాగే ఉద్యోగ విరమణ పొందుతున్న డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయుడిని సన్మానించి..వారి సేవలను కొనియాడారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..ఈ విద్యాలయంలో అదనపు తరగతి గదులు పూర్తి చేయించామని తెలిపారు. ఈ విద్యాలయంలో బోధన , వసతులపై నమ్మకంతో

2లో

## ట్రిపుల్ ఐటీలో సీట్లు విద్యార్థులు





**చురకలు విలేకరి,రాయికల్, జూన్ 30 :** రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పదవ తరగతి అభ్యసించిన విద్యార్థులు తాలూకా శ్రీరామ్, గుమ్మడి అక్షర ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు మండల విద్యాధికారి రాఘవులు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కృషి,పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించగలరని నిరూపించారని అన్నారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాసర ట్రిపుల్ ఐటీ లో సీట్లు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు పొన్నం రమేష్,రవీందర్,మల్లేశం,నాగరాజు,పద్మజ, తిరుమల, గంగాధర్ ,శివానందం,యాస్మిన్ ఫాతిమా, శ్రీకాంత్ అభినందించారు.

## రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం



**చురకలు విలేకరి, కొడిమ్యాల, జూన్ 30 :** కొడిమ్యాల మండలంలోని పూడూరు, తిర్మలాపూర్ రైతు వేదికల్లో మంగళవారం దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూడూరు రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని రైతులతో మాట్లాడారు. రైతు భరోసా ద్వారా రైతులకు అందుతున్న సహాయంపై సీఎం వివరించిన అంశాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్, మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి, పూడూరు సర్పంచ్ అగుర్ల మల్లేశం, కోడిమ్యాల సర్పంచ్ జీవన్ రెడ్డి, పూడూరు పాక్స్ చైర్మన్ బండ రవీందర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ కే. రాజేష్, రామకిస్తాపూర్ సర్పంచ్ నేరెళ్ళ మహేష్, పూడూరు, గౌరపూర్ ఉపసర్పంచ్లు, వివిధ గ్రామాల రైతులు, ఏఈఓలు పాల్గొన్నారు.

## అధికారుల సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి



**మొదటి పేజీ తరువాయి...** అందజేసి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి వారి సేవలను అభినందించారు.అలాగే వారి కుటుంబ సభ్యులకు కూడా శుభా కాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగ కాలంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ పోలీసు శాఖలో పనిచేసిన ప్రతి రోజు తమ జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు.తమ సేవా కాలంలో సహకరించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు,సహోద్యో గులు,సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.పోలీసుశాఖలో పనిచేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని,భవిష్యత్తులో కూడా సమాజానికి తమవంతు సేవలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వేణు,సైదులు పోలీసు అధికారులు, సిబ్బంది, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి తులం బంగారం ఎక్కడ..?

**-మూడు బడ్జెట్లు ముగిసినా ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి..?**

**-ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూన్ 30 :** కళ్యాణ లక్ష్మి పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన తులం బంగారం ఏమైందని, ఆరోగ్యారెంటీలు ఏమయ్యాయని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. కమలాపూర్ మండలంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక భరోసా కల్పించిన కల్యాణలక్ష్మి, గర్భిణీలకు అండగా నిలిచిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, రైతులకు రైతుబంధు వంటి సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తుంటే, కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం చెక్కులతో పాటు తులం బంగారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు.వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందని,యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. యూరియా పంపిణీలో యాప్ పేరుతో అమలు చేస్తున్న విధానాలు రైతులకు మరిన్ని ఇబ్బందు లు సృష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు.ఇలాంటి పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు అవసరం ఎంత కీలకమో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కాళేశ్వరం ద్వారా నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లు, ప్రాజెక్టులు నింపితే కరువు పరిస్థితులు తలెత్తేవి కాదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి విలువ ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనే ప్రజలకు పూర్తిగా అర్థమవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా రైతులకు మూడు విడతల రైతుబంధు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో గొప్పగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు ఎక్కడ అమలయ్యాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మరోసారి అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గారు ధీమా వ్యక్తం చేశారు.

# విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**మొదటి పేజీ తరువాయి...** తల్లి దండ్రులు పిల్లలను అడ్మిషన్ చేస్తున్నార ని వివరించారు.400 కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు.పదో తరగతిలో ఈ పాఠశాల నుంచి చాలా మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని వెల్లడించారు. ప్రతి విద్యార్థి తమ నేపథ్యం ఏదైనా తాము ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే తాము అనుకున్న లక్ష్యం చేరుకుంటారని పేర్కొన్నారు. వివిధ ఉద్యోగాలు, స్వయం ఉపాధి, ఇతర రంగాల్లో స్థిరపడిన తర్వాత విద్యార్థులు సమాజానికి సేవ చేయాలని సూచించారు.విద్యార్థి దశలో మొక్కలు నాటాలని, పరిసరాల పరిశుభ్రత పై వివరించాలని, నీటి వృథాను అరికట్టాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

**పాఠశాల అభివృద్ధిపై సీఎం దృష్టికి తీసుకెళ్తా..**

పాఠశాల పూర్వ విద్యార్థి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. పాఠశాల ఎంతో మందికి ధైర్యం ఇచ్చిందని, ఈ బడిలో సీటు రావడం చాలా కష్టంగా ఉండేదని గుర్తు చేశారు .తల్లితండ్రులకు కూడా నమ్మకం ఉందని తెలిపారు. అపుడు తమకు ఎంతో మంది ఉపాధ్యాయుల మార్గదర్శనం, సూచనలతో ఇప్పుడు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డామని పేర్కొన్నారు.వివిధ దేశాలు, ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. అందరూ సమానమేనని, ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదివి.. ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యా శాఖ ను తన వద్ద పెట్టుకొని దేశంలో మోడల్ గా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారని వెల్లడించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని వెల్లడించారు.బొప్పాపూర్ స్కూల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. స్కూల్ అభివృద్ధికి రూ. లక్ష విరాళం ప్రకటించారు. పాఠశాల అభివృద్ధిపై పూర్వ విద్యార్థి గా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం,జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, సర్పంచ్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో అర్హుల ఓట్లు కాపాడాలి

**మొదటి పేజీ తరువాయి...** హాజరై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎస్ఐఆర్‌లో మృతుల ఓట్లు మాత్రమే తొలగించేవారని, ఇప్పుడు ఎన్నికల సంఘం కొత్త ఆంక్షలతో ప్రజల్లో భయానక వాతావరణం సృష్టిస్తోందన్నారు. ఎస్ఐఆర్ పేరిట పశ్చిమ బెంగాల్‌లో 30 లక్షల ఓట్లు తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్‌లో ఆంక్షలకు అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్షాలు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ ద్వారా ప్రతి ఓటరును కలిసే అవకాశం వస్తోందని, ఈ అవకాశాన్ని కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు తొలగితే సంబంధిత పత్రాలతో అప్పీల్ చేసుకునే వెసులుబాటు ఉందని, బీఆర్ఎస్ తరపున ఓటర్లకు లీగల్ సలహాలు, సూచనల కోసం ప్రత్యేక కమిటీ పనిచేస్తుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రైతు బంధును ఎలాంటి ఆంక్షలు లేకుండా అమలు చేశారని, దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రేవంత్ ప్రభుత్వం రైతు బంధును రెండు ఎకరాలకు కుదించి ఎగవేసిందని, రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ప్రతి క్వింటాల్ ధాన్యంపై 8 కిలోల కోత, ఎకరానికి 6 వేల రూపాయల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. కేసీఆర్ 200 రూపాయల పెన్షన్‌ను 2000కు పెంచారని, దేశంలో ఎక్కడా లేని బీడీ పెన్షన్‌ను ప్రవేశపెట్టారని కొనియాడారు. కానీ 30 నెలలుగా రేవంత్ ప్రభుత్వం ఒక్కరికి కూడా బీడీ పెన్షన్ ఇవ్వలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిన పిల్లర్లను మరమ్మతు చేయకుండా నిర్లక్ష్యం చేశారని, తుమ్మిడిహెట్టిపై కేంద్రానికి లేఖ రాయడానికి రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. జూలై 7న కేటీఆర్ సమావేశాన్ని ఊరూరా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం దావ వసంతసురేష్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో అర్హుల ఓట్లు తొలగకుండా బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగలని విమర్శించారు. పార్టీ కార్యాలయంలో న్యాయ సహాయం అందిస్తామని, సభ్యత్వ నమోదు యాప్ ద్వారా జగిత్యాల నుంచి రికార్డు స్థాయిలో సభ్యత్వాలు చేయాలని కోరారు. బీఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి చేరికతో పార్టీకి వెయ్యి ఏనుగుల బలం చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, తాటిపర్తి రాంచంద్ర రెడ్డి, తాటిపర్తి సీకే రెడ్డి, సర్పంచ్‌లు జున్ను రాజేందర్, పొట్టవతిని సతీష్, శీలం సురేందర్, స్వామి రెడ్డి, పోనిశెట్టి మహేష్, పిఏసీఎస్ మాజీ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీపి ధర రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

**-నాణ్యత ప్రమాణాలతో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి**

**-చైర్ పర్సన్, కమిషనర్లకు కౌన్సిలర్ లావణ్య వినతి**



**చురకలు విలేకరి, జగిత్యాల, జూన్ 30 :** వర్షాకాలం నేపథ్యంలో పట్టణంలో దోమలు,ఈగల నివారణ చర్యలు, పారిశుద్ధ్య పనులు నాణ్యత ప్రమాణాలతో చేయాలని జగిత్యాల పురపాలక సంఘం 50వవార్డు కౌన్సిలర్ ములస్తం లావణ్య మహేష్ మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్,కమిషనర్ సత్యప్రణవ్‌లకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగిత్యాల పట్టణ ప్రజలకు వ్యాధులు రాకుండా కొత్తనీరు సరఫరా చేయాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందన్నారు. దోమల నివారణకు, మురికి కాలువల శుభ్రానికి గత కౌన్సిల్‌లో రూ.25లక్షలు,పారిశుద్ధ్య కార్మికులకు ఆప్రాన్లు,బూట్లు వంటి రక్షణ పరికరాలకు రూ.9లక్షలు బడ్జెట్ కేటాయించారని గుర్తుచేశారు. ఈ నిధులు దుర్వినియోగం కాకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఖర్చు చేయాలని కోరారు. వర్షాకాలంలో రోడ్లు, గుంతల్లో నీరు నిలవకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని,హోటళ్లు,టిఫిన్ సెంటర్ల వద్ద ఈగలు,దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు కూడా ఇళ్ల వద్ద,స్టేబుల్స్ వద్ద కొబ్బరి చిప్పలు,గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉంచవద్దని,డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచినీటి పైపులు పగిలితే వెంటనే మరమ్మతులు చేసి సురక్షిత మంచినీరు అందించాలని కోరారు.

# ఉద్యోగ విరమణ సేవా జీవితానికి ముగింపు కాని..సమాజ సేవకు కాదు

**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 30 :** ఉద్యోగ విరమణ సేవా జీవితానికి ముగింపు కాని..సమాజ సేవకు కాదని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటరమణ ఉద్యోగ విరమణ సందర్భంగా జగిత్యాలలోని వీకేబీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై డిఎస్పీ వెంకటరమణను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. సమర్థవంతమైన విధి నిర్వహణ, సహోద్యోగులతో మంచి సంబంధాలతో శాఖకు గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఉద్యోగ విరమణ సేవా జీవితానికి ముగింపు మాత్రమే, సమాజ సేవకు కాదన్నారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబంతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్, కరుణాకర్, రవి, లక్ష్మీనారాయణ, వేణు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది వెంకటరమణ సేవలను గుర్తు చేసుకుంటూ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు.

# గ్రామంలో ప్లాస్టిక్ నిషేదిద్దాం

**-పంచాయతీ కార్యాలయం ద్వారా బహిరంగ ప్రకటన**

**-వర్షకోండ గ్రామ సర్పంచ్ పోనుకంటీ వెంకట్**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జున్ (30) :** పర్యావరణం కాపాడుకునేందుకు ప్లాస్టిక్ నిషేదిద్దామని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని వర్షకోండ గ్రామ సర్పంచ్ పోనుకంటీ వెంకట్ అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గ్రామంలో పర్యవరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ను నిషేధం చేస్తున్నట్లు బహిరంగ ప్రకటన జారి చేశారు.గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా,ఆరోగ్యంగా ఉంచడం మరియు పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత,డ్రైనేజీలు పూడి పోవడానికి ముఖ్య కారణం ప్లాస్టిక్ వ్యర్థాలే కావున,ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మన గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించి, మన గ్రామంలో సింగిల్ యూజ్ (ఒకసారి వాడి పారేసే) ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించడం జరిగిందని, విక్రయించిన వాడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తీర్మానం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ మంథని 47వ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



**చురకలు ప్రతినిధి,మంథని,జూన్ 30 :** లయన్స్‌క్లబ్‌ఆఫ్ మంథని 2026-27 సంవత్సరానికి సంబంధించిన 47వ నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మంగళవారం మంథనిలోని ఎంఎంఆర్ బ్యాంకెట్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.జిల్లా మాజీ గవర్నర్ (గ్రాణ+) డాక్టర్ ఆర్.విజయ ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడిగా లయన్ మేడగోని వెంకటేష్,కార్యదర్శిగా లయన్ ముస్కుల లోకేందర్ రెడ్డి,కోశాధికారిగా లయన్ మందల మల్లారెడ్డి,ఉపాధ్యక్షుడిగా పెండ్రు సుమంత్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేబినెట్ కార్యదర్శి లయన్ వొల్లాల కృష్ణహరి,జిల్లా కేబినెట్ ట్రెజరర్ లయన్ కొల్లూరి ఆనందం, రీజియన్ చైర్‌పర్సన్లు లయన్ రేకులపల్లి శశాంక, లయన్ కావేటి రాజగోపాల్, జోన్ చైర్‌పర్సన్లు లయన్ సదుల వెంకటేశ్వర్లు, లయన్ వెల్పుల రమేష్, లయన్ బెల్లంకొండ జైపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు అతిథులుగా హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మేడగోని వెంకటేష్ మాట్లాడుతూ సమాజ సేవకు ప్రాధాన్యం ఇస్తూ విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. సభ్యుల సహకారంతో క్లబ్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు.


## ఎమ్మెల్యేను కలిసిన ఇరిగేషన్ ఎస్ఈ



**చురకలు విలేకరి,జగిత్యాల,జూన్ 30 :** జగిత్యాల జిల్లా ఇరిగేషన్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్‌గా నూతనంగా నియమితులైన ప్రకాష్ రావు సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఈ ప్రకాశ్ రావు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు,కాలువల నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ,డీఈ రమేష్,ఏఈ శ్రీనివాస్ తదితర ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు వరం

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,జూన్ 30 :** సీఎం సహాయ నిధి పేదలకు వరంగా నిలుస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2లక్షల 50 వేల విలువగల చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవసరమైన పేదలకు వైద్య సహాయం అందించేందుకు సీఎం సహాయ నిధి ద్వారా చెక్కులు మంజూరు చేయిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమీండ్ల శ్రీనివాస్, తిరుమలయ్య, రవీందర్ రావు, బోడ్ల జగదీష్, కోరే గంగమల్లు, శేఖర్ చందా పృథ్వీ, ఏనుగుల రాజు, బోనగిరి నారాయణ, నక్క గంగాధర్, సాయి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తా

**-తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్,**

**కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు**



**చురకలు విలేఖరి ఇబ్రహీంపట్నం జూన్ (30) :** వేములకుర్తి గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు.మశీగళవారం మెట్ పల్లి పట్టణంలోని జువ్వడి భవన్ లో ఇటీవల గ్రామ అభివృద్ధి చైర్మన్ గా ఎన్నికైన ఎడిపెల్లి మురళి ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలి అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి,సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి,ఉపాధ్యక్షుడు తరి రామానుజం,మాజీ ఎంపీపి నేరెళ్ల దేవేందర్, సర్పంచ్‌లు బండి రాజేష్,తోట రమేష్,నాయకులు సింగని మారుతి,చల్ల దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ

**-మండలంలో 96% శాతం ఇన్యుమరేషన్ పత్రాల పంపిణీ పుర్తి**
**-ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాలు అందజేస్తున్న బిఎల్వోలు**
**-ఎప్పటికప్పుడు పనితీరు పరిశీలిస్తున్న అధికారులు**



**చురకలు విలేకరిఇబ్రహింపట్నం జున్ (30) :** తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల పరిశీలనలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్ కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. బిఎల్వోలు ప్రతి ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్నిమరేషన్ పత్రాలను అందజేస్తున్నారు.జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదుర్ తిమ్మపుర్, తిమ్మపుర్ తండ,యామపుర్, ఫకిర్ కోండాపుర్, వేములకుర్తి, బర్దిపుర్, ములరాంపుర్,ఎర్దండి, కోమటికోండాపుర్, వర్షకోండ,డబ్బ, అమ్మకపెట్, ఎర్రాపుర్, ఇబ్రహీంపట్నం, కేశాపూర్ ,కోజన్ కోత్తుర్ గ్రామలలో 37 మంది బిఎల్వోలు గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి ఇన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్నారు.ప్రభుత్వం ముద్రించిన ఫార్మాట్‌లో కుటుంబ వివరాలను ఎన్యూమరేటర్లు సేకరించి నమోదు చేస్తారు. అందులో 56 ప్రధాన ప్రశ్నలు,19 అనుబంధ ప్రశ్నలు కలిపి మొత్తం 75 ప్రశ్నలకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు.పార్ట్-1, పార్ట్-2 కింద8పేజీల్లో ఆయా వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేస్తారు. కాగా,ప్రతి ఒక్క కుటుంబ యజమాని ఎన్యుమరేటర్‌కు సరైన సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.కుటుంబ యజమాని ఎవరు,ఆ ఇంట్లో ఉండే మొత్తం కుటుంబాలు ఎన్ని? అనే సమాచారం తెలియజేయాలి.ఈ సర్వేలో కిరాయిదారులు వారు ప్రస్తుతం ఉన్న ఇంట్లో కానీ, వారి స్వగ్రామంలో కానీ సర్వే చేయించుకోవచ్చు. ఉపాధి కొరకు వేరే ప్రాంతాల్లో ఉంటే నమ్మకస్థులు లేదా బంధువుల ద్వారా కుటుంబ వివరాలు ఎన్యుమరేటర్‌కు తెలపాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో బిఎల్వోల పనితీరును ఎప్పటికప్పుడు తాహసిల్దార్ వరప్రసాద్ పరిశీలిస్తు, ఎప్పటికప్పుడు బిఎల్ఓలకు పలు సూచనలు అందిస్తున్నారు.ఇబ్రహీంపట్నం మండలంలో 96%ఇన్యుమరేషన్ పత్రాల పంపిణీ పూర్తయినట్లు తాహసిల్దార్ తెలిపారు.

# బీజేపీ నాయకులకు పరామర్శ



**చురకలు విలేకరి,జగిత్యాల,జూన్ 30 :** రాయికల్ మండలం శ్రీరామ్‌నగర్ గ్రామ బీజేపీ బూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర శశాంక్, గంగాధర శ్రీనివాస్ లు రోడ్డు ప్రమాదంలో గాయపడి జగిత్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారిని మంగళవారం బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా. బోగ శ్రావణి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఆమె వెంట సర్పంచ్ రాధిక శ్రీరామ్, నాయకులు ఆముద రాజు,కాశెట్టి తిరుపతి తదితరులున్నారు.

# యామపుర్‌లో పౌరహక్కుల దినోత్సవం



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జూన్ (30) :** సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను పొందాలని ఉద్దేశంతో పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే)ను నిర్వహిస్తున్నరు ఈమేరకు మంగళవారం జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని యామపుర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు.ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించు కోవడంతోపాటు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని,సమాజంలో అందరూ సమానంగా జీవించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కనుక నాగేష్,ఎస్సి హస్టల్ వార్డెన్ పెద్దులు,జిపిఓ శ్రీనాథ్,పంచాయతీ కార్యదర్శి నవిన్,ఎఎన్ ఎం రామగిరి సుప్రియ,దామెర శ్రీనివాస్ పోలిస్ సిబ్బంది మదన్,సంతోష్,అంగన్వాడీలు లక్ష్మీనర్సు,అనురాధ, అశలు రాధ,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వర్గీయ ఎమ్.స్వామినాథం వర్ధంతి స్మరణ సభ




**చురకలు ప్రతినిధి హైదరాబాద్, జూన్ ,30 :** తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం పూర్వ అధ్యక్షులు స్వర్గీయ ఎమ్.స్వామినాథం వర్ధంతి స్మరణసభ మంగళవారం హైదరాబాద్ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించ బడింది.టిఎన్జీఓఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్,జిల్లా కార్యదర్శి కూరాడి శ్రీనివాస్ ఆధ్వర్యం లో జరిగిన ఈకార్యక్రమానికి టిఎన్జీఓఎస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎమ్.హుస్సేని (ముజీబ్) ముఖ్య అతిథిగా హాజరై, స్వామినాథం చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఎమ్. హుస్సేని (ముజీబ్) మాట్లాడుతూ స్వర్గీయ ఎమ్. స్వామినాథం ఉద్యోగుల హక్కుల సాధన,సంక్షేమం కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. టిఎన్జీఓఎస్ యూనియన్‌ను బలోపేతం చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఉద్యోగి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్,జిల్లా కార్యదర్శి కూరాడి శ్రీనివాస్ మాట్లాడుతూ నాన్-గెజిటెడ్ అధికారుల హక్కుల పరిరక్షణ కోసం స్వామినాథం గారు చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం హైదరాబాద్ జిల్లా యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టిఎన్జీఓఎస్ హైదరాబాద్ నగర అధ్యక్షులు కె. శ్రీకాంత్,హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి జి.గీత,జిల్లా కార్యవర్గ సభ్యులు ముఖీం ఖురేషి, ఎ.వి.శ్రీధర్,మహ్మద్ వాహిద్,మహ్మద్ ముస్తఫా,వివిధ యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు,ప్రాథమిక సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వర్గీయ ఎమ్. స్వామినాథం ఉద్యోగ లోకానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళు లర్పించారు.

# మంత్రి శ్రీధర్ బాబు దంపతులపై అసత్య ప్రచారాలు తగవు



**చురకలు విలేకరి, మెట్‌పల్లి, జూన్ 30:** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన సతీమణి (సీనియర్ ఐఏఎస్ అధికారిణి)లపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై మెట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీప్ ఫేక్, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వంటి ఆధునిక సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ, మంత్రి దంపతులపై అనుచిత పోస్టింగులు పెడుతున్న మంథని బిఆర్ఎస్ నాయకులకు వారు ఘాటు హెచ్చరికలు జారీ చేశారు.టీ.పి.సి.సి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మెట్ పల్లి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బిఆర్ఎస్ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఒక గౌరవప్రదమైన స్థానంలో ఉన్న మంత్రి పై, సీనియర్ ఐఏఎస్ అధికారిణి పై ఇష్టానుసారంగా పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి చిల్లర రాజకీయాలకు పాల్పడే వారికి తగిన సమయంలో ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. శ్రీధర్ బాబు కి కేవలం మంథని నియోజకవర్గంలోనే కాకుండా, యావత్ తెలంగాణ వ్యాప్తంగా ఒక నిబద్ధత గల మంచి నాయకుడిగా పేరుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు అశేషమైన అనుచర గణం, అభిమానులు ఉన్నారనే విషయాన్ని బిఆర్ఎస్ నాయకులు మర్చిపోకూడదు.ఇంకోసారి సోషల్ మీడియా వేదికగా ఇలాంటి పిచ్చి పిచ్చి పనులు చేస్తూ, వ్యక్తిగత దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని, తాము కూడా చేతులకు పని చెప్పాల్సి వస్తుందని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. చట్టపరంగా, రాజకీయంగా తగిన బుద్ధి చెప్తామని, తక్షణమే ఇలాంటి అసత్య ప్రచారాలు ఆపాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుతుబ్ పాషా, కాంగ్రెస్ నాయకులు కల్లెడ గంగాధర్, యూత్ నాయకులు నల్లూరి సాగర్, బైండ్ల శ్రీకాంత్, దినేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# హిందువుల సమస్యలు పట్టించుకోని మున్సిపల్ పాలక వర్గం



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూన్, 30 :** నిర్మల్ మున్సిపల్ కౌన్సిల్ లో ఒక వర్గానికే కొమ్ము కాసేలా నిర్ణయాలు తీసుకొని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదని పార్టీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, పట్టణ బీజేపీ నాయకులు సాధం అరవింద్ లు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారు. 42 వార్డులలో నెలకొన్న అనేక సమస్యలను పక్కన బెట్టి కేవలం మైనారిటీ వర్గానికి కొమ్ముకాసేలా ఎజెండాలు రూపొందించడం సరికాద న్నారు.బక్రీద్ పండగ కు సంబంధించి బిల్లులు ఆమోదం తీసుకోవడం కోసం, మరియు నిర్మల్ జిల్లా కేంద్రంలో వివాదాస్పదంగా మారిన ఈద్గా అభివృద్ధి కొరకు మున్సిపల్ జనరల్ ఫండ్ నుండి 50లక్షలు కేటాయించడం కొరకు కౌన్సిల్ ఏర్పాటు చేయడం సిగ్గుచేటన్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని అనేక కాలనీల్లో రోడ్ల పైకి నీరు చేరుతుందని ఇటువంటి అత్యవసర పనుల గురించి దృష్టి సారించాలని, కేవలం మైనారిటీల కోసం ప్రజాధనాన్ని కేటాయించి హిందువులకు అన్యాయం చేయాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. ఒకవైపు అనేక కాలనీల్లో రోడ్లు డ్రైనేజ్ లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కేవలం రియలేస్టేట్ దందా కోసం 21 వ వార్డ్ లో జన నివాసాలు లేకున్నప్పటికీ 50 లక్షలతో డ్రైన్ కు కేటాయించడం సరికాదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధులతో అన్ని వార్డ్ లలో సమానంగా అభివృద్ధి పనులకు కేటాయించాలని హితవు పలికారు. తక్షణమే కౌన్సిల్ లో పేర్కొన్న హిందూ వ్యతిరేక ఎజెండా లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల రానున్న రోజుల్లో తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, సాదం అరవింద్, కౌన్సిలర్లు శ్రీరామోజీ నరేష్, జింక సూరి, కూన శశాంక్, విఠల్, సాత్విక్, ముత్యం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# "ప్రజా బాట"లో విద్యుత్ భద్రతపై విస్తృత అవగాహన

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూన్ 30 :** హుజూరాబాద్ విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలో స్థానిక టౌన్ సెక్షన్‌లో మంగళవారం నిర్వహించిన 'ప్రజా బాట' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో విద్యుత్ భద్రతపై వినియోగదారులు, వ్యవసాయదారులకు విస్తృత అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ కరీంనగర్ డీఈ (టెక్నికల్ అండ్ సేఫ్టీ) శ్రీ ఉపేందర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బందికి విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి 'వన్ మినిట్ సేఫ్టీ' సూత్రాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి పని ప్రారంభించే ముందు ప్రమాదాలను అంచనా వేసి, అవసరమైన భద్రతా




చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని వివరించారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వయంగా ఫ్యూజ్‌లు మార్చేందుకు ప్రయత్నించవద్దని, ఏవైనా లోపాలు తలెత్తినప్పుడు వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని సూచించారు. వ్యవసాయ మోటార్లకు అదనపు లోడ్లు ఉపయోగిస్తున్న రైతులు 5 హెచ్‌పీ నుంచి 7.5 హెచ్‌పీ వరకు అదనపు లోడ్లను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించుకోవాలని అవగాహన కల్పించారు. విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం, ప్రమాదాల నివారణ లక్ష్యంగా పొడవైన విద్యుత్ లైన్లపై మధ్య స్తంభాల ఏర్పాటు, దెబ్బతిన్న షార్ట్ పోల్స్ మార్పిడి, వదులుగా ఉన్న వైర్ల (లూజ్ స్పాన్లు) సరిదిద్దడం, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాల ప్లింత్‌లను ఎత్తు పెంచడం, వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రజల భాగస్వామ్యంతో విద్యుత్ భద్రతను మరింత బలోపేతం చేసి, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏఈ (ఆపరేషన్), ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

# సుదీర్ఘ సేవలకు ముగింపు...

### -హిందీ పండిత్ తీగల సత్యనారాయణకు ఘన వీడ్కోలు

**చురకలు ప్రతినిధి, వేములవాడ, జూన్ 30 :** వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాస్త్రాజ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిత్‌గా సేవలందించిన తీగల సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో మంగళ వారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు,



విద్యార్థులు, చిన్ననాటి మిత్రులు మాట్లాడుతూ, తీగల సత్యనారాయణ తన సుదీర్ఘ సేవా కాలంలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో విద్యార్థులకు విద్యాబోధన చేసి ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన ఆదర్శ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. విద్యార్థుల్లో విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ పెంపొందించడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సహచర ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు ఏనుగు జ్యోతి, ఎలా శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, బాల్య మిత్రులు ఎల్లాల ఆనంద రెడ్డి, తాహేర్ పాషా, మోటురీ మల్లేశం, దుర్గం పరశురాం, కొలిపాక శ్రీనివాస్, లాయక్ పాషా, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ మునిసిపాలిటీలో.. ఏం జరుగుతోంది?

**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)**

హుజురాబాద్ మునిసిపాలిటీలో ఏం జరుగుతోంది? కొత్త పాలకవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించి సుమారు ఐదు నెలలు గడుస్తున్నా ఇంకా పాలన ఎందుకు పట్టాలెక్కడం లేదు?అనే చర్చ జరుగుతోంది. హుజురాబాద్ మేజర్ గ్రామపంచాయతీ, నగర పంచాయతీ నుండి మునిసిపాలిటీగా అప్ గ్రేడ్ అయిన తర్వాత..దాదాపు 10ఏళ్ల పాటు రెండు పాలకవర్గాలు పనిచేశాయి. గత పాలకవర్గాల సమయంలో అభివృద్ధి కార్యక్రమాలు చెప్పుకోదగ్గ స్థాయిలో జరిగాయి. హుజురాబాద్‌లో పార్కు నిర్మాణం, స్మశాన వాటిక నిర్మాణం, మున్సిపల్ కార్యాలయ నిర్మాణం, రోడ్ల విస్తరణ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వంటివి జరిగాయి. అలాగే ఉప ఎన్నికల సమయంలో సిసిరోడ్లు లక్షలాది రూపాయలతో పూర్తిస్థాయిలో నిర్మించారు.

**పాలన "స్లో"గా ఉందా?**

మునిసిపల్ ఎన్నికలు జరిగి ఐదు నెలలు గడిచిపోయాయి. అయితే పాలన విషయంలో పాలకవర్గం అనుకున్న స్థాయిలో తనమార్కును ప్రదర్శించ





లేకపోయిందనే అభిప్రాయం సర్వత్ర వ్యక్తమవుతోంది. దీనికి కారణాలను పలువురు విశ్లేషిస్తున్నారు. ఇందులో కొంతమంది మొదటిసారి ఎన్నిక కావడంవారికి అనుభవంలేకపోవడం కూడా కారణమని భావన వ్యక్తమవుతోంది. మునిసిపల్ చైర్‌పర్సన్‌కు కూడా గతంలో రాజకీయ అనుభవం లేకపోవడం కూడా ఒక కారణమని పలువురు చెప్పున్నారు. సుమారు 30వేల మంది ఓటర్లు కలిపి 50వేల పైచిలుకు జనాభా కలిగిన హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలో అనేక సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను మునిసిపల్ పాలకవర్గం శ్రద్ధ తీసుకొని పరిష్కరించాల్సి ఉంది. కానీ ఇక్కడ అలాంటి పరిస్థితి ఏదీ కనిపించడం లేదు.

**సమస్యలు పరిష్కారం అయ్యేనా?**

హుజురాబాద్‌లో ముఖ్యమైన సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. స్థానిక పాత కూరగాయల మార్కెట్ అర్ధాంతరంగా నిలిచిపోయింది. హుజురాబాద్‌లో క్రీడాకారులకు ఇండోర్ స్టేడియంతో పాటు అవుట్డోర్ స్టేడియం కూడా నిర్మాణం చేయాల్సి ఉంది. పట్టణంలో పారిశుద్ధ్య సమస్య కూడా ఉంది. కొన్నిచోట్ల రోడ్లపైనే డ్రైనేజీనీరు ప్రవహిస్తోంది. వరంగల్ కరీంనగర్ ప్రధాన రహదారిలో కరీంనగర్ వైపు డ్రైనేజీ నిర్మాణం రెండువైపులా జరగాల్సి ఉంది. పట్టణంలో పలుచోట్ల కొత్తగా పార్కులను, ఓపెన్ జిమ్‌లను ప్రతిపాదించి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులను తీసుకురావలసి ఉంది. మునిసి పల్ చైర్ పర్సన్ వైస్‌చైర్‌పర్సన్‌ల మధ్య కూడా సమన్వయం లేనట్టుగా కనిపిస్తోంది. ప్రభుత్వం నుండి వచ్చిన ఆర్థిక సంఘం నిధుల విషయంలోనూ, అలాగే ప్రతిపాదించిన పనుల విషయంలోనూ స్పష్టత కరువైంది. ప్రజలకు జవాబు దారిగా ఉండాల్సిన పాలకవర్గం..తనకేం సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తోంది. ప్రజల్లోనూ కొత్త పాలకవర్గం విషయంలో యాక్టివ్‌గా ఉన్నారనే ఫీల్ రావడం లేదు. కొంతమంది కౌన్సిలర్లు ఇన్ని డబ్బులు ఖర్చు పెట్టి ఎందుకు గెలిచామా?అని తలలు పట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా పాలకవర్గం అధికారులు నిస్తేజాన్ని వీడి ప్రజలతో మమేకమై పాలనను పరుగులు పెట్టించడమే కాక.. ప్రజా సమస్యలకు పరిష్కరించాలని, అలాగే చెప్పుకోదగ్గ పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్లో ఉన్న పనులను కూడా పూర్తి చేయాలని, లేకుంటే పాలకవర్గం ప్రజల్లో తొందరలోనే విశ్వసనీయతను కోల్పోయే అవకాశం ఉందని ఇప్పటికైనా జాగ్రత్త వహించాలని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే..
# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన లక్ష్యం

### -కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్
### -సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన హుజురాబాద్ ఇంచార్జి ప్రణవ్




**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూన్ 30 :** ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పాలనలో నిరుపేదలైన లబ్ధిదారులకు సంక్షేమం అభివృద్ధి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 82 మంది లబ్ధిదారులకు రూ 30 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. నిరుపేదలు పరిస్థితి బాగోలేక ఆసుపత్రులపాలైన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కుల రూపంలో అండగా ఉంటుందని, ఇప్పటివరకు హుజురాబాద్ లో సుమారు రూ. 10కోట్ల రూపాయల చెక్కులు పంపిణీ చేశామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో పారదర్శకత పాటిస్తున్నామని త్వరలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వబోతున్నామని అన్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఏవరైనా డబ్బులు అడిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ప్రజా ప్రజాప్రతినిధులు, మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీఆదివరాహస్వామి ఆలయానికి అభివృద్ధికి సహకరిస్తా



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 30 :** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆదివారహస్వామి ఆలయానికి అన్ని విధాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తారని సింగరేణి సంస్థ ఆర్.జి.3స్రవి సుంకర మధుసూదన్ అన్నారు. మంగళవారం కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆదివారహస్వామి మీ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ డైరెక్టర్లు తీగల రాజయ్య సది తదితరులు ఘనంగా సన్మానించారు. ఆలయ అర్చకులు రామానుజాచార్యులు జిఎంచే ప్రత్యేక పూజలను నిర్వహింప చేశారు అనంతరం స్వామివారికి అర్చన చేశారు. ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో జిఎంను ఘనంగా సన్మానించారు. మంత్రి శ్రీధర్ బాబు ఆదేశానుసారం సింగరేణి సంస్థపరంగా తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.

# శివాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూన్ 30 :** జగిత్యాల పట్టణంలోని శ్రీ శివాంజనేయ స్వామి ఆలయంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్‌ను, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులను ఆలయ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యయుతంగా మున్నూరు కాపుపటేల్ సంఘం ఎన్నికలు

**-మున్నూరు కాపు పెద్దలు 18 సంవత్సరాల నిండిన యువతి యువకులు ఓటు వెయ్యడానికి అర్హులు**

**-మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ వెల్లడి**




**చురకలు ప్రతినిధి సిరిసిల్ల జూన్ 30 :** తెలంగాణ రాష్ట్రంలో 40లక్షల నుండి 50లక్షల వరకు ఉండే మున్నూరు కాపుల జనాభా సంఖ్య 13లక్షలకు పడి పోయినందున సంఖ్యాబలం తెలుసుకోవడం కోసం ప్రజాస్వామ్యయుతంగా 33జిల్లాల్లో గ్రామ గ్రామానా మున్నూరు కాపు పటేల్ సంఘానికి త్వరలో ఎన్నికలు నిర్వహించభోతున్నామనిమున్నూరు కాపు తెలంగాణరాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్యపటేల్ ప్రకటించారు. వేములవాడ శ్రీరాజా రాజేశ్వర మున్నూరుకాపు నిత్య అన్న సత్రంలో మున్నూరుకాపు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల కొమురయ్య పటేల్ అధ్యక్షతన సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మున్నూరుకాపు రాష్ట్ర సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ పాల్గొని మాట్లాడుతూ తాను పుట్టిన జన్మస్థలమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి సత్రం రేణుక మాత సాక్షిగా లక్ష మందితో రాష్ట్ర పటేల్ సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొన్నామన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మున్నూరు కాపు కుల బంధువులు కంకణ బద్ధులై ఒక బాధ్యతగాతీసుకొని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు గత రెండు రోజుల నుండి ఎవరికి వారుగాఈ సమావేశంలో పాల్గొనడం జరిగిందన్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బొప్ప దేవయ్య పటేల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల కొమురయ్య పటేల్ ప్రధాన కార్యదర్శి సోమ్‌శెట్టి శంకర్ పటేల్ నామాల పోశెట్టిపటేల్ ఆధ్వర్యంలో మంగళవారం నియోజక వర్గం నుండి 6గురు చొప్పున కమిటీ సభ్యులను మండలాల నుండి 250 మందిని కమిటీ సభ్యులను తీసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సేకరించిన జనాభా లెక్కల సమయంలో పేరు చివరన పటేల్ పేరు లేనందున కులగణనలో పేరు నమోదు చేసుకోకపోవడం వల్ల రాష్ట్రంలో మున్నూరు కాపుల జనాభా తగ్గిందని సంఖ్యాబలం నిరూపించడం కోసమే రాష్ట్రంలోని 33 జిల్లాలో ఎన్నికలు త్వరలో నిర్వహిస్తామన్నారు. తాను 20 సంవత్సరాలుగా రాష్ట్రంలో మునూరు కాపు కుల బంధువుల కోసం పని చేస్తున్నా అని గుర్తు చేశారు. పటేల్ ఈజిట్ కావాలని 2018లో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు పటేల్ సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు పటేల్ సంఘం ఎన్నికలకు వెళ్తుతుందన్నారు గత సంవత్సర కాలంగా ఎనిమిది కులాలు మేము మున్నూరు కాపు కులస్థులమని చెప్పుకుంటున్నాయని అందుకే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మున్నూరు కాపుపటేల్లలో చైతన్యం తీసుకువచ్చి మీ కులంలో మీరు ఉండండయ్యా,,,,,,,,మా పటేల్ సంఘం లోకి మీరు దయచేసి రావద్దయ్యా,,,, అబాసు పాలు కావద్దయ్యా,,,,,, అని తెలియజేస్తూ ఒకే కులం ఒకే సంఘం అని లక్షమందితో ఎన్నికలు నిర్వహించబోతున్నామని ఆయన చెప్పారు. సెల్‌లో పటేల్‌యాప్ ద్వారా మున్నూరు కాపు పటేల్ సంఘ సభ్యులందరికీ ఐడి కార్డులు ఇచ్చి మున్నూరు కాపు పెద్దలకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి యువకులకు ఓటు హక్కు కల్పిస్తామని ఆ ప్రయత్నం చేస్తున్నట్లు అయన చెప్పారు. మిస్ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల కొమురయ్య పటేల్ ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి శంకర్ పటేల్ నామాల పోశెట్టి పటేల్ నందికిషన్‌పటేల్ మాసం రత్నాకర్ పటేల్ బండారి బాల్ రెడ్డి పటేల్,పడిగెల రాజుపటేల్,బండారి శ్యామ్‌పటేల్ మంగని మనోహర్ పటేల్ కొలుగూరి మధు పట,కచ్చకాయల బాలరాజు సోమినేని బాలు,మేడిశెట్టి శ్రీనివాస్ అనిల్ పటేల్ కిష్టయ్య పటేల్ బిక్షపతి పటేల్,రవి పటేల్ రాజుపటేల్ నరేష్‌పటేల్ వివిధ మండలాలకు చెందిన మున్నూరు కాపు సంఘాల అధ్యక్షులు గ్రామ సంఘాల అధ్యక్షులు ,జిల్లా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఎన్నికల నిర్వహణ కమిటీ నియామకం జిల్లా ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా బొప్ప దేవయ్య పటేల్,కో కన్వీనర్‌లుగా కూరగాయల కొమురయ్య పటేల్ నరాల పోశెట్టి పటేల్‌సోమిశెట్టి శంకర్ పటేల్,అగ్గి రాములు పటేల్,కల్లూరి రాజు పటేల్,బండారిశ్యాము పటేల్ , పడిగేల రాజు పటేల్,నంది కిషన్ పటేల్ ,నంది శంకర్ పటేల్,బండారి బాల్రెడ్డి పటేల్ మెంగని మనోహార్ పటేల్ దుమాల రవీందర్ పటేల్ కొడిమ్యాల వేణు పటేల్ మధుపటేల్ సోమిశెట్టి బాలు పటేల్‌లను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ ప్రకటించారు.

# ప్రధానోపాధ్యాయులు పులి అశోక్ రెడ్డి పదవి విరమణ మహోత్సవం

**-అశోక్ రెడ్డి దంపతులను సన్మానించిన డీఈవో ప్రశాంత్ రెడ్డి**



**చురకలు విలేఖరి వీణవంక జూన్ 30 :** వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి అశోక్ రెడ్డి మంగళవారం పదవీ విరమణ చేశారు. ఆయన సుదీర్ఘ సేవలను కొనియాడుతూ పాఠశాల ఆవరణలో ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి ప్రశాంత్ రెడ్డి హాజరై,అశోక్ రెడ్డి విద్యా వ్యవస్థకు అందించిన అమూల్యమైన సేవలను అభినందించారు. క్రమశిక్షణతో కూడిన ఆయన విద్యాబోధన ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిందని డీఈఓ కొనియాడారు. ఈ విరమణ మహోత్సవంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తోటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు,పాఠశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారంతా అశోక్ రెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ,ఆయన శేష జీవితం ప్రశాంతంగా,ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం అశోక్ రెడ్డి దంపతులను శాలువాలు,పూలమాలలతో ఘనంగా సత్కరించి,ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శోభారాణి, వీణవంక సర్పంచ్ దాసారపు సరోజన, ఉప సర్పంచ్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మహిళకు రూ.1.33 లక్షలు సాయం

**చురకలు విలేకరి, ధర్మపురి, జూన్ 30 :** అప్పుల బాధతో భరించలేక కొన్ని నెలలక్రితం భర్త ఆత్మహత్యకు పాల్పడగా,అంగవైకల్యంతో ఇద్దరు కుమారుల పోషణ బాధ్యతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిరుపేద బాధిత మహిళకు ఫేస్‌బుక్ మిత్రులు రూ. 1.33 లక్షలు సాయం అందించారు. ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన మంద సునిత-నరేష్ దంపతులకు ఇద్దరు కుమారులు. నరేష్ అప్పుల బాధతో కొన్నినెలల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సునిత ఎడమ కాలుకు ఇన్ఫెక్షన్ సోకడంతో 8నెలల క్రితం కాలును తొలగించారు. మరో కాలు కూడా తొలగించాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. బాధిత మహిళ సమస్యను వివరిస్తూ ధర్మపురి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ ఫేక్ బుక్‌లోపోస్ట్ చేసి సాయం అందించాలని కోరాడు. ఎన్నారైలు స్పందించి సునిత బ్యాంకు ఖాతాకు రూ. 1.33 లక్షలు విరాళాలు అందించారు. వాటిని స్థానిక ఎస్సై మహేష్, యూనియన్ బ్యాంక్ అధికారి అమర్ చేతుల మీదుగా పంపిణీ చేయించారు.



# ధర్మపురి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



**చురకలు విలేకరి, ధర్మపురి, జూన్ 30 :** ధర్మపురి పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 33 ఎజెండా అంశాలతో పాటు మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై కౌన్సిల్ సభ్యులు విస్తృతంగా చర్చించారు. అనంతరం 33 ఎజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎం. శ్రీనివాస్ రావు, వైస్ చైర్‌పర్సన్ ఇందారపు రామన్న, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోమన్‌పల్లిలో పౌరహక్కుల దినోత్సవం



**చురకలు విలేకరి,బీర్‌పూర్, జూన్ 30 :** బీర్‌పూర్ మండలంలోని కోమన్‌పల్లి గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా తహశీల్దార్ సుజాత మాట్లాడుతూ అంటరానితనం నేరమని, గ్రామంలో దళితులను వేరుగా చూడడం దళితుల హక్కులకు భంగం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామ ప్రజలందరూ సమానమేనని, సామరస్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. అనంతరం సర్పంచ్ సీపతి స్వాతి రమేష్ మాట్లాడుతూ అందరికీ సమాన అవకాశాలు, గౌరవం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, గిర్దావర్ రాహుల్, జీపీవో సత్యనారాయణ, పోలీస్ కానిస్టేబుల్ సంధ్య, ఉప సర్పంచ్ ఆసరి మహేష్, వార్డు సభ్యులు గడ్డం జమున, గజ్జె భాగ్యమ్మ, తత్ర రమేష్, పంచాయతీ కార్యదర్శి గుడాల మధుసూదన్, కారోబర్ మ్యాడ గంగరెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలి

**-ఎంపీడీవోకు జగిత్యాల రూరల్ సర్పంచుల వినతి**



**చురకలు విలేకరి, జగిత్యాల, జూన్ 30 :** మండల సర్వసభ్య సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరుతూ మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని గ్రామ సర్పంచులు ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ తాము పదవీ బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించలేదన్నారు. గ్రామపంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుద్ధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, నిధుల కేటాయింపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు సర్పంచులకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి నెలా మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలని, గ్రామపంచాయతీలకు అవసరమైన నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రాజేందర్, సతీష్, మహేష్, గంగన్న, వంశీ, రవి, కవిత, స్వామిరెడ్డి, లక్ష్మి, రాధ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# “సర్” ప్రక్రియ వేగవంతం చేయండి

**-సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి**

**-జమ్మికుంటలో సర్‌పై అవగాహనలో పాల్గొన్న కోమటిరెడ్డి,ప్రణవ్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూన్ 30 :** ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా సర్ ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనేలా చూడాలని,బూత్ లెవెల్ అధికారి వచ్చినప్పుడు ఓటర్లకు వారి అనుమానాలు నివృత్తి చేయడానికి కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు లు కృషి చేయాలని,ఓట్ల సమగ్ర సవరణలో జాగ్రత్తగా ఉండాలని కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో మంగళ వారం జమ్మికుంట పట్టణంలోని 4,5, 19, 27, 28,30వార్డులలో బూత్‌కో ఆర్డినేటర్లు,బూత్ లెవెల్ ఏజెంట్లతో ఓటు సమగ్ర సవరణ (సర్)కార్యక్రమ సరళిని పరిశీలించారు.వార్డులలో తిరుగుతూ ఓటర్లు పలు ప్రశ్నలు వేయగా వాటికి బూత్ లెవెల్ ఆఫీసర్లతో మాట్లాడి అనుమానాలు నివృతి చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలో 10 బూతులకు ఒకరు చొప్పున పట్టణానికి నలుగురు కో ఆర్డినేటర్లను నియమించామని తెలిపారు.ఈ కో ఆర్డినేటర్లు బూత్ లెవెల్ ఏజెంట్లతో సమన్వయం చేస్తూ సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కాంట్రాక్టర్లకు తప్ప,ప్రజలకు చేసింది ఏది లేదని,కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలను విమర్శించే ముందు 10ఏళ్ళు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు తాము చేసిన పనులు ఎందుకు చేయలేదో ఆత్మ విమర్శన చేసుకోవాలని అన్నారు.కాళేశ్వరం కట్టి లక్షల కోట్లు దోచుకొని,కూలేశ్వరంగా మార్చి తెలంగాణ ప్రజలకు అన్యాయం చేశారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా హామీలు నెరవేరుస్తూ పేదవాడి ప్రభుత్వంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజవర్గ సర్ కో ఆర్డినేటర్, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, యూత్ నాయకులు, మహిళ నాయకురాళ్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణే ధ్యేయంగా ఆపరేషన్ ముస్కాన్

**-జులై 1 నుంచి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు**

**-జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల,జూన్ 30 :** బాలల సంరక్షణే ఆపరేషన్ ముస్కాన్ ధ్యేయమని, జిల్లాలో జులై 1 నుంచి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల రక్షణ, పునరావాసం లక్ష్యంగా జులై 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమంపై మంగళవారం జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ మాట్లాడుతూ జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. చిన్నారుల హక్కుల పరిరక్షణ, విద్యకు దూరమైన పిల్లల గుర్తింపు, బాల కార్మికుల రక్షణ, తప్పిపోయిన పిల్లలను కుటుంబాలకు చేర్చడం, భిక్షాటన చేస్తున్న చిన్నారుల రక్షణ, ఆశ్రయం అవసరమైన బాలలకు సంరక్షణ ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను ఏ విధమైన పనిలోనైనా నియమించడం చట్టవిరుద్ధమన్నారు. హోటళ్లు, టీ స్టాళ్లు, గ్యారేజీలు, వర్క్‌షాపులు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, వ్యవసాయ క్షేత్రాలు, షాపింగ్ సముదాయాలు, నిర్మాణ పనులు, గృహాల్లో పనిచేస్తున్న బాలలను గుర్తించి తక్షణ రక్షణ కల్పిస్తామన్నారు. రక్షించబడిన పిల్లలకు వైద్య పరీక్షలు, కౌన్సెలింగ్, పాఠశాలల్లో చేర్చి, అవసరమైతే బాలల సంరక్షణ గృహాలకు తరలిస్తామన్నారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై బాల కార్మిక చట్టం, జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి పోలీస్, మహిళా శిశు సంక్షేమ, కార్మిక, విద్యా, వైద్య ఆరోగ్య, రెవెన్యూ శాఖలు, జిల్లా బాలల సంరక్షణ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాలో బాలకార్మికులు, భిక్షాటన చేస్తున్న చిన్నారులు,ఆశ్రయం అవసరమైన బాలలు కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా డయల్-100కుసమాచారం ఇవ్వాలని కోరారు.ఆపరేషన్ ముస్కాన్-12నువిజయ వంతంగా నిర్వహించి బాలల రక్షణ, పునరావాసం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, కార్మిక శాఖ అధికారులు, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ప్రతినిధులు, చైల్డ్‌లైన్ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, ఆపరేషన్ ముస్కాన్ ప్రత్యేక బృంద సభ్యులు పాల్గొన్నారు.

# హోంగార్డులను అధికారులు వేధించొద్దు

**-అన్యాయ బదిలీలను వెంటనే రద్దు చేయాలి**

**-డీజీపీకి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి హుజూరాబాద్, జూన్ 30 :** రాష్ట్రంలో ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు సేవలందిస్తున్న హోంగార్డులను అన్యాయంగా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ డీజీపీ వెంటనే జోక్యం చేసుకుని హోంగార్డుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వారికి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 16 వేల మంది, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 1,100 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. స్వల్ప వేతనంతో కుటుంబాలను పోషిస్తున్న హోంగార్డులను వందల కిలోమీటర్ల దూరాలకు బదిలీ చేయడం వల్ల వారు తీవ్ర ఆర్థిక, కుటుంబ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హుజూరాబాద్, వేములవాడ, మంథని, సిరిసిల్ల తదితర ప్రాంతాల మధ్య హోంగార్డులను తరచూ బదిలీ చేయడం వల్ల వారి జీవనం భారంగా మారిందన్నారు. నెలకు సుమారు రూ.30 వేల వేతనం పొందే హోంగార్డులు ప్రతిరోజూ దూరప్రాంతాలకు ప్రయాణించడం సాధ్యంకాదని పేర్కొన్నారు. మానవీయ కోణంలో ఆలోచించి ఈ బదిలీలను వెంటనే పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. గతంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో హోంగార్డుల నుంచి అక్రమ వసూళ్లు జరిగినట్లు అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం కొంతమంది హోంగార్డులను ప్రతిపక్ష నాయకులను కలిశారనే పేరుతో బెదిరించడం, వారి వివరాలు సేకరించాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఉద్యోగుల



మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని విమర్శించారు. హోంగార్డులను వీలైనంత వరకు వారి సొంత జిల్లాల్లో లేదా కొత్త జిల్లా పరిధిలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, అన్యాయ బదిలీలను వెంటనే రద్దు చేసి హోంగార్డులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డీజీపీని కోరారు.

# నాలుగున్నర దశాబ్దాల మధుర జ్ఞాపకాలతో అపూర్వ మిత్రులు

**-పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలవడం ఆనందదాయకం**

**-చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు**





**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 30 :** నాలుగున్నర దశాబ్దాల క్రితం విద్యాభ్యాసం చేసిన చిన్ననాటి మిత్రులంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలతో గంటలపాటు ఆహ్లదకరమైన వాతావరణంలో గడిపారు. 1979-80 సంవత్సరంలో రామగుండం పట్టణంలోని జిల్లా పరిషత్ లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులంతా మంగళవారం రామగుండం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలతో... చిన్ననాటి మధురమైన అనుభూతులతో ఎంజాయ్ చేశారు. నేడు ఆ పూర్వ విద్యార్థుల వయసు 60 వసంతాలు... అయినా పూర్వ విద్యార్థులంతా ఒకే చోట కలవడంతో వయసుభేదాన్ని మరిచి ఎంతో ఆనందంగా సంతోషంగా ఒకరినొకరు పలకరించుకుంటూ చిందులేస్తూ గడిపేశారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హాజరై చిన్ననాటి స్నేహితులతో సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల మంత్ర ఒకే చోట కలవడం ఎనలేని ఆనందాన్నిస్తోంది అన్నారు. పూర్వ విద్యార్థిని అరుకొండ మాధవి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు.తోటి అలనాటి విద్యార్థులు ఉపాధ్యాయులు కొందరు స్వర్గస్తులైన వారి సూచనగా వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు.ఈ ఆత్మీయ సమ్మేళనానికి సందర్భంగా ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా చైర్పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, రిటైర్డ్ ఏఎస్పి అరుకొండ విద్యాసాగర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల వివిధ శాఖలో ఉద్యోగాలు చేసి పదవీ విరమణ చేసిన, ఆనంద్, పద్మ, రాజేశ్వర్, ఎన్ రాజేష్, రవికుమార్, జే రాజేశం తోపాటు రిటైర్డ్ ఏఎస్పి విద్యాసాగర్ తో పాటు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలను, మంచిర్యాల జిల్లా పరిషత్ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి లను అలనాటి మిత్రులందరూ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఓదేలు మాట్లాడుతూ ఇటువంటి మహోత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామ గ్రామాన స్థిరపడిన వారిని గుర్తించి ఒకే చోట కలిపిన మాధవి విద్యాసాగర్ లకు ధన్యవాదాలు అని అన్నారు.46సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఇటువంటి ఆత్మీయ అను బంధాలు కలిసి ఉండాలని పేర్కొన్నారు. శ్రీరాములు,సంజనభట్ల రవీందర్, సుశీల,సురేఖ,పద్మ,శ్యాములు, రవికుమార్,రాజేంద్రప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు జబ్బార్ ఖాన్, జక్కం సత్యనారాయణ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తాం

**-రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్**



**చురకలు విలేకరి,ధర్మపురి, జూన్ 30 :** 2027లో జరిగే గోదావరి పుష్కరాలు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోరకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ప్రైవేట్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో గోదావరి తీరంలో మంత్రి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మంత్రి తెలిపారు.బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఆలయాల అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఇందులో ధర్మపురి నియోజకవర్గానికి రూ. 117కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు.ధర్మపురి క్షేత్రానికి పుష్కర స్నానాలు ఆచరించే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.పుష్కరాలకు వచ్చే భక్తుల కొరకు తాగునీటి సౌకర్యం,డ్రెస్సింగ్ రూమ్స్,మరుగుదొడ్ల సౌకర్యం,పారిశుద్ధ్య పనుల నిర్వహణ కొరకు గత గోదావరి పుష్కరాలకు,కృష్ణ పుష్కరాలకు పనులు చేసిన ప్రతినిధులతో కలిసి ఈరోజు పరిశీలించినట్లు మంత్రి తెలిపారు.మౌలిక సదుపాయాల కల్పనకు చేయాల్సిన ఏర్పాట్లపై కన్సల్టెన్సీ ప్రతినిధు లు పూర్తిస్థాయి నివేదిక అందజేస్తారని మంత్రి తెలిపారు.ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నుండి అదనపు నిధులు తీసుకువచ్చి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. మంత్రి వెంట జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్,మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల రాజు, ధర్మపురి మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న , వార్డు కౌన్సిలర్లు చీపిరిశెట్టి రాజేష్, అయ్యోరి గోపాల్, పవన్, ఓజ్జల లక్ష్మణ్ లతో పాటు జక్కు రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ నాయకులకు సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 30 :** కమాన్ పూర్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎస్.ఎస్. అన్వర్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ నూతన గా నియమితులైన సభ్యులకు సన్మానం కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఎల్లె రామ్మూర్తి,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గా నియమితులైన రొడ్డ బాపన్నలను కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.ఎస్.అన్వర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.శాలువాలు కప్పి,పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన బాధ్యతలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతల ను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి,పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన ఎల్లె రామ్మూర్తి, రొడ్డ బాపన్న పార్టీ నాయకత్వానికి, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ ఆశయాలకు అనుగుణంగా ప్రజల మధ్య ఉంటూ సంస్థాగత బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ మండల సర్పంచులు రంగు సత్యనారాయణ గౌడ్, శీలరపు మల్లయ్య, గుమ్మడి శ్రీనివాస్, పొనగంటి కుమార్, రామగిరి మండలం మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క--కొమురయ్య, మాజీ ఎంపీటీసీ తీగల సమ్మయ్య, మాజీ సర్పంచ్ బాబూరావు, నరేష్, ఉపసర్పంచులు మహమ్మద్ రఫీక్ సోహెల్, ఒడ్నాల శ్రీనివాస్, ఆదివరాహ దేవస్థానం డైరెక్టర్లు బూస శ్రీనివాస్, చాట్ల రాయమల్లు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శేవ్వా శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అబ్దుల్ రఫీక్, మల్యాల మహేష్ గౌడ్,వార్డు సభ్యులు మెరుగు కుమార్, పచ్చునూరి రాజ్‌కుమార్ పల్లె కనకయ్య, జగిలి కుమార్,మల్యాల నరేష్,చిగురు రవి,గుమ్మడి సతీష్,బోనాల సత్యనారాయణ,అనవేణి వేణు,గెల్లు లింగయ్య, మానక స్వామి,నామాని శ్రీకాంత్, రేకుంట్ల సందీప్,నర్సయ్య,బ్యాంకు మల్లేష్,ఆదినారాయణ,బుతాగడ్డల ప్రశాంత్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన నియమితులైన జిల్లా కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**-నాణ్యమైన దర్యాప్తుతో పెండింగ్ కేసుల విచారణ పూర్తి చేయాలి**

**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు విలేకరి, రాయికల్, జూన్ 30 :** నూతన సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నాణ్యమైన దర్యాప్తుతో పెండింగ్ కేసుల విచారణ పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. పోలీస్ శాఖలో సేవల నాణ్యతను మరింత మెరుగు పరచడం,ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించడం, నేరాల నియంత్రణ,నేరాల ఛేదన, కేసుల దర్యాప్తు నాణ్యత,రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించేందుకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మంగళవారం రాయికల్ పోలీస్ స్టేషన్ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసులు, పెండింగ్ కేసుల పురోగతి,దర్యాప్తు విధానం,నేరాల నియంత్రణ చర్యలు, స్టేషన్ నిర్వహణ,రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో విచారించి, నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్టేషన్లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రికార్డు లు, సిబ్బంది విధుల కేటాయింపు, కార్యాలయ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. 5ఎస్ విధానంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్ సిబ్బంది యూనిఫాం నీట్ టర్న్ అవుట్తో ఉండాలని,క్రమశిక్షణ, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అనంతరం సిబ్బందితో సమావేశమై వారి సమస్య లను అడిగి తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు.నూతన సాంకేతిక పరిజ్ఞానం పై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన పెంపొందించు కోవాలని, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఎస్పీ సూచిం చారు.డయల్ 100కు వచ్చే ప్రతి కాల్పి వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి అత్యంత వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ న్యాయం అందే లా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. పాత నేరస్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, వారి ని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ నేరాల నివారణకు కృషి చేయాలని సూచిం చారు.విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమకు కేటాయించిన గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిం చాలని తెలిపారు.ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటువల్ల నేరాల నియంత్రణలో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రత, మోసగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతు లపై ప్రజలను చైతన్యపరిచి, అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రూరల్ సీఐ సుధాకర్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు సుధీర్ రావు, గీత, రాజు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# గల్ఫ్ పంపిస్తానని మోసం చేసిన తల్లీ కొడుకులపై కేసు నమోదు

**-ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రాహుల్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట జూన్ 30 :** తన కొడుకు గల్ఫ్ దేశంలో పని చేస్తాడని,అతనికి ఏజెంట్ లైసెన్స్ ఉందని అమాయకులకు కంపెనీ వీసా తో గల్ఫ్ పంపిస్తామని మాయ మాటలు చెప్పి వారి వద్ద నుండి అధికంగా డబ్బులు తీసుకొని మోసం చేస్తున్న తల్లీ కుమారుడిపై కేసు నమోదు చేసి మహిళను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా కోర్టు ఆమెకు కోర్టు రిమాండ్ విధించిందని ఆమె కుమారుడు పరారీ లో ఉన్నట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రాహుల్ రెడ్డి తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామానికి చెందిన గున్నాల మమత హరిదాస్ నగర్ గ్రామానికి చెందిన గున్నాల మమత కుమారుడు గున్నాల శ్రీకాంత్ గల్ఫ్ దేశం వెళ్లి అక్కడే ఒక కంపెనీలో పని చేస్తున్నాడు.గున్నాల మమత తన కొడుకు శ్రీకాంత్‌కి ఏజెంట్ లైసెన్స్ ఉందని అమాయక ప్రజలకు మాయ మాటలు చెప్పి వారిని గల్ఫ్ పంపించి మంచి కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి వారిని విసిట్ వీసా మీద గల్ఫ్ దేశం పంపించేది అని అక్కడి కంపెనీ లో ఉద్యోగం చూపించకుండా వారిని మోసంచేసి అధికంగా డబ్బులు తీసుకు నేదనీ ఎస్ ఐ తెలిపారు.ఇలా పలువురి ని మోసం చేసిన విషయంలో గతంలో కొనరావుపేట పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదయిందనీ అలాగే తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గుండ్ల రాజు కుమారుడు అయిన గుండ్ల నవీన్ ని గల్ఫ్‌దేశం పంపిస్తానని అతని వద్ద నుండి 1,70,000రూపాయలు తీసుకొన్నారని,గుండ్ల నవీన్‌ను విజిట్ పిసా మీద దుబాయ్ పంపగా దుబాయిలో ఉన్న మమత కుమారుడు గున్నాల శ్రీకాంత్,నవీన్‌ను అక్కడ కంపెనీలో పనిచూపకుండా రోజువారి పని చేయించి అటు ఇటు తిప్పినాడనీ ,కంపెనీ వీసా కోసం డబ్బులు తీసుకొని మోసం చేసి విజిట్ మీద పంపినారని గుర్తించి తమ డబ్బులుతమకు ఇవ్వాలని అడిగితే ఏం చేసుకుంటారో చేసుకో వారు బూతులు తిట్టినారనీ తిమ్మాపూర్ కు చెందిన గుండ్ల రాజు దరఖాస్తుపై గున్నాల మమత పై,అతని కొడుకు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి సోమ వారం గున్నాల మమతను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని మెజిస్ట్రేట్ గున్నాల మమతకు రిమాండ్ విధించా రనీ ఎస్ఐ తెలిపారు.

# కొండగట్టు అంజన్నకు అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు శాలువా బహుకరణ



**చురకలు విలేకరి, మల్యాల, జూన్ 30 :** రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ తన అద్భుత నైపుణ్యాన్ని మరోసారి చాటుతూ, అగ్గిపెట్టెలో ఇమిడేంత సూక్ష్మంగా నేసిన పట్టు శాలువాను కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామివారికి భక్తిపూర్వకంగా సమర్పించారు. చేనేత కళకు ప్రతీకగా నిలిచిన హరిప్రసాద్, అత్యంత సన్నని దారాలతో ఎంతో శ్రమించి రూపొందించిన ఈ ప్రత్యేక పట్టు శాలువా అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అగ్గిపెట్టెలో సులభంగా ఇమిడిపోయే ఈ శాలువా ఆయన కళా నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. కొండగట్టు ఆలయానికి చేరుకున్న హరిప్రసాద్, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ అరుదైన శాలువాను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ ఆంజనేయస్వామి ఆశీస్సులతోనే ఈ కళాఖండాన్ని రూపొందించి స్వామివారికి సమర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.